# దొంగగారు (మినీ కథ)

- మల్లాది వెంకట కృష్ణమూర్తి

నాయుడు గారి తోటలోకి తరచూ ఎవరో వచ్చి బంగినపల్లి మామిడిపళ్లు కోసుకెళ్తూండటం ఆయన దృష్టికి వచ్చింది. ఆయనకి బంగినపల్లి మామిడి పళ్లంటే తగని ప్రీతి. అవి కాసే సీజన్‌లో రోజుకి నాలుగైదుసార్లు తింటాడవి. అందుకే ప్రత్యేకంగా తోటలో ఆ చెట్లని నాటించాడు. అవి ఆ జిల్లాలో దొరకని అరుదైన వెరైటీ.

సీతయ్య తోటలో పాక వేసుకుని ఆ తోట బాగోగులు చూస్తూ కాపలాగా కూడా వుంటు న్నాడు. అయితే అంత పెద్దతోటని ఒక్కడు కాపలా కాయడం కష్టం. దొంగతనాలు మొదలయ్యాయి. ఆ దొంగతనాలు తెల్లవారుఝామున సీతయ్య నిద్రలో వుండగా జరుగుతున్నాయి.

సంగతి విన్న నాయుడు తన ఇంట్లో పెంచు కునే ఆల్సేషియన్ కుక్క రోజీని తోటకి పంపాడు. దాంతో ఒకటి రెండు రోజులు దొంగ తనాలు ఆగిపోయాయి. అయితే మూడో రోజు తెల్లవారుఝామున రోజీ చచ్చిపడి వుంది. దానికి విష ప్రయోగం జరిగిందని గ్రహించారు పక్కనే పడివున్న బ్రెడ్ ముక్కలని చూసి. ఆ సంగతి విన్న నాయుడు గారికి బాధతోపాటు కోపం తన్నుకు వచ్చింది.

తోట చుట్టూ వున్న ముళ్ల కంచెని పీకించి బార్బర్డ్ వైర్ కంచెని ఇరవై నాలుగ్గంటల్లో కట్టించేశాడు. ఆ బార్బర్డ్ వైర్‌లో సదా కరెంట్ ప్రవహించే ఏర్పాటు చేయడమే కాక ఆ సంగతి గ్రామ ప్రజలకి తెలిసేలా తోటకి అన్నివైపులా బోర్డు రాయించి వుంచాడు. అయినా ప్రయోజనం లేకపోయింది. తోటకి వెళ్లే కరెంట్ వైర్‌ని ఎలక్ట్రిక్ పోల్ దగ్గర కట్ చేసేశాడు దొంగ. ఆ రాత్రి మళ్లీ యథావిధిగా మామిడిపళ్ల దొంగతనం జరిగింది.

'డామిట్. ఇంతదాకా సగానికి సగం పళ్లని దొంగిలించేశాడు ఎవడో గానీ ఆ దొంగ వెధవ. వీడి బాబుగాడి సొమ్మనుకున్నాడా?' ఆ సంగతి తెలిసి కోపంగా రంకెలేశాడు నాయుడు.

తర్వాత స్థిమితంగా ఆలోచించి సీతయ్యని పిలిచి చెప్పాడు, ఆ బోర్డ్ మీద ఏం రాయించాలో. 'దొంగగారూ! తోటలోని పళ్లల్లో ఆరింటిలోకి ఇంజక్షన్‌తో విషాన్ని ఎక్కించామని గమనించ గలరు' అని మర్నాడు ఆ బోర్డులన్నింటి మీద రాయించాడు సీతయ్య. వాటిని చదివిన గ్రామ ప్రజలంతా 'నాయుడు ఎంత దుర్మార్గుడో' అనుకుంటున్నారని సీతయ్య వచ్చి చెప్తే 'పిచ్చివాడా! నిజంగా పండులోకి విషం ఎక్కించలేదు. దొంగగారిని భయపెట్టడానికి ఉత్తినే అలా రాయించాను. చూశావా. దాంతో ఈ రాత్రి దొంగతనం జరగనేలేదు' చెప్పాడు నాయుడు మీసం దువ్వుకుంటూ.

మర్నాడు ఉదయం తోటలోంచి ఆదుర్దాగా పరిగెత్తుకుంటూ వచ్చాడు సీతయ్య. అతన్ని చూడగానే ఏదో అయిందని గ్రహించిన నాయుడు కీడు శంకిస్తూ అడిగాడు.

'ఏం జరిగిందిరా?'

'పెద్ద ఘోరమే జరిగిపోయింది బాబయ్యా' చెప్పాడు సీతయ్య వగరుస్తూ.

'ఏమిటా ఘోరం?'

'ఇక ఈ ఏడాది మీరు మీ తోటలోని ఒక్క మామిడి పండునీ తినలేరండీ'

'అదేం? దొంగలు అన్ని పళ్లు తీసుకెళ్లి పోయారా?' ప్రశ్నించాడు నాయుడు ఆత్రంగా.

'కాదయ్యా. మన మన బోర్డులన్నింటి మీదా దొంగ ఈ చీటీలు అంటించి వెళ్లాడయ్యా'

సీతయ్య అందించిన నాలుగు చీటీల్లో ఏం రాసివుందో చదివాడు నాయుడు.

అన్నింటిలోని విషయం ఒకటే.

'ఇప్పుడు మీ తోటలోని ఆరు కాదు, పన్నెండు పళ్లలోకి ఇంజక్షన్ ద్వారా విషం చేరిందని గమనించ ప్రార్థన.'

ఇట్లు
దొంగ.

★